

# సరికొత్త పాతకథ

కథానిక

ఆ పువ్వు చూడగానే బలరామ్ ముఖం వివర్ణమైంది. అంతవరకు సరదాగా పిచ్చాపాటీ మాట్లాడుతూ నలుగురిని నవ్విస్తున్న వాడల్లా శిలాప్రతిమలా స్తబ్ధుడై ఆ పువ్వువంక చూస్తూ కూర్చున్నాడు. "బ ల రా మ్!" అని యెవరో పిలిచేసరికి వులిక్కిపడి నిద్దరలోంచి మేలుకున్నవాడిలా అందరివంకా ఒక్కసారి పరకాయించి చూసి, అక్కడనుంచిలేచి తనగదికి వెళ్ళిపోయాడు. మాకేమీ అర్థం కాలేదు. మా హాస్టలులో వాళ్ళందరికీ బలరామ్ అంటే విపరీతమైన ప్రేమ. అతను ఎక్కడవుంటే అతని చుట్టురా యిరవై ముప్పైమంది జనం మూగుతూ వుంటారు. అతను విచారంగా వుండగా చూసినవాళ్లు యింతవరకూ ఎవ్వరూ లేరనే చెప్పవచ్చు. ఒక్కొక్కసారి రెండు మాసాలదాకా కూడా యింటిదగ్గరనుంచి చిల్లిగవ్వకూడా రాని సమయంలో సైతం అతను మామూలుగా యెప్పటిలాగే, ప్రపంచంలో తనంత అదృష్టవంతుడు, సుఖవంతుడు లేనట్టుగా కనపడేవాడు. అలాంటివాడు యీనాడు ఒక్కసారిగా యీ విధంగా బెంబేలుపడటం చూసేసరికి హాస్టలువాళ్ళం హైరాన పడ్డాం.

రాత్రి భోజనందగ్గరకూడా బలరామ్ ఎవరికీ కనిపించలేదు. మెల్లగా పదిన్నర అవుతున్నప్పుడు మాట్లాడకుండా గదిలోకివచ్చి కూర్చున్నాడు. కొద్దిక్షణాలదాకా మేమిద్దరం ఏమిమాట్లాడలేదు. అతను ఏదో ఆలోచనలో మునిగిపోయాడు. నేనెల్లా మొదలెట్టాలో తెలియక కూర్చున్నాను. నావంక చూసి "ఒకసిగరెట్టు యియ్యి" అని అన్నాడు. మాట్లాడకుండా సిగరెట్టు పెట్టె అగ్గిపెట్టె అతనికి యిచ్చాను. సిగరెట్ సగంకాల్చి బయటికిచూస్తూ "ఇవాళ నా మనస్సేం బాగుండలేదురా" అన్నాడు. నేనేం సమాధానం చెప్పలేదు. అయినా ఏం సమాధానం చెప్పగలను?

"సరదాగా జరుగుతున్న పార్టీమధ్యలోంచి వెళ్ళిపోయానని మీకు చాలామందికి కోపం వచ్చివుంటుంది."

"కోపానికేంవుందిలే, నీకు ఎందువల్ల మనస్సుకి కష్టం కలిగిందో తెలియక ఖంగారు పడ్డాం"

"కొన్నికొన్ని విషయాలు ఎవరితోనూకూడాచెప్పుకోలేనివి వుంటాయి. మనస్సులోనే అణచబడిఒక్కసారి మన బలహీనతని గ్రహించి అవి బయటికివస్తూంటాయి. అప్పుడు ఎంతటివాడూ డీలా అయిపోతూ వుంటాడు."

* * *

నా చిన్నతనంలో నన్ను సైకిలుగాముడని పిలిచేవాళ్ళు. సైకిలుమీద రకరకాల ఫీట్లు చేయడం అనేకనిముషాలు ఒక్కేదిశలో సైకిలును తొక్కకుండా నిలపడం యిటువంటి పనులు చేసి చుట్టుప్రక్కలవాళ్ళకి ఆశ్చర్యాన్ని కలిగిస్తూండేవాడిని. స్కూలుఫైనలుకు వచ్చేసరికి మా నాన్న తనదగ్గరున్న డబ్బుపెట్టి టాక్సీలు, లారీలు ఆవీ కొని సర్వీసుపెట్టాడు. చాలా లాభంవచ్చేది. నేను చదువంటే అట్టే శ్రద్ధచూపించకుండా, ఎప్పుడూ కారుతోలడం, బాగుచెయ్యడం వీటిలో కాలం

సూరిబాబు

గడుపుతూ వుండేవాడిని. నాతోబాటు మా క్లాసులో యిద్దరు కోమట్లుండేవారు. వెండి, బంగారం వ్యాపారంలో వాళ్ళ పెద్దలు చాలా ఆస్తిని సంపాదించారు. పేరుకి వైశ్యులేగాని, ఆచార వ్యవహారాలన్నింటిలోనూ బ్రాహ్మలకి ఏమాత్రం తీసిపోయేవాళ్లు కాదు. వాళ్ళకి కమలాక్షి అనే చెల్లెలుండేది. నా కళ్ళకి ఆ పిల్ల రంభలాగా కనిపించేది. ఒకరోజున జోరుగా సైకిలు తొక్కుకొంటూ వాళ్ళ యింటిముందునుంచి స్కూలుకు వెళుతున్నాను. సరిగ్గా వాళ్ళ యింటిదగ్గరికి వచ్చేసరికి ఒక చిన్నపిల్లవాడు సైకిలుకు అడ్డంగా వచ్చాడు. నేను వెంటనే బ్రేకువేసి సైకిలు ఆపేశాను. కుర్రవాడు బిత్తరపోయి సైకిలువంక చూసి వెనక్కితిరిగి పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు. గుమ్మంలో కమల నుంచుని యీ దృశ్యమంతా చూస్తోంది. నేనటు చూడగానే నావంక చిరునవ్వునవ్వింది. నేనారోజంతా ఏనుగెక్కినంత సంబరపడ్డాను.

మరునాటినుంచి స్కూలుకు వచ్చేసమయాన అక్కడ ఒక్కక్షణం ఆగటం ఆపిల్ల నన్నుచూసి చిరునవ్వు నవ్వటం మామూలైపోయింది. ఇలా ఒకటిరెండు నెలలు గడిచాయి. ఒకరోజున ఇంట్లో ఏమీతోచక బయటికి బయలుదేరాను. కొంచెం దూరం వెళ్ళేసరికి, నన్ను ఎవరో వెంటాడుతున్నట్టుగా అనుమానంవేసి వెనక్కి తిరిగి చూశాను. కమలాక్షివాళ్ళింట్లో పనిచేసే అమ్మాయి పదిహేనుపదహారేళ్ళది నా వెనకాలవస్తోంది. నేను కొంచందూరం నడిచి ఒక పాడుపడ్డ యింటి దగ్గర ఆగాను. అప్పటికి చీకటిపడటం మొదలు పెట్టింది. నేనా యింట్లోకి వెళ్ళగానే, ఆ పిల్ల కూడా నా వెనకనే ఆ యింట్లోకి వచ్చింది. నన్నుచూసి చిరునవ్వునవ్వి తలవంచుకుంది.

"ఏం ఎందుకిలా వచ్చావు?" అని నేనడిగాను.

"ఏంలేదు, వూరికేనే"

"ఏంలేదూ? వీళ్ళవెంటా వాళ్ళవెంటా పోవడం నీకు అలవాటా?"

"అదికాదండి."

"ఏదికాదు?"

"కోప్పడకొండి. చాలారోజులనుంచి నాకు మీరంటే ఎంతోయిష్టం."

నేను ఒక్కక్షణం ఏంమాట్లాడలేక పోయాను.

"అయితే!" అని అన్నానుకాని అదేం సమాధానం చెప్పలేదు. పమిటకొంగు చేతివ్రేళ్ళతో తిప్పుతూ కాలి బొటనవ్రేలితో నేలమీద రాయుటం మొదలుపెట్టింది. నేను కొంచెం కోపంగా-

"ఈసారి వూరుకున్నాను. ఇంకోసారి యిటు వంటిపని చేశావంటే జాగ్రత్త" అన్నాను. బయటికివచ్చి కొంచందూరం వెళ్ళిన తరువాత యీ సంఘటననిగురించి ఆలోచిస్తూ వెనక్కితిరిగి వచ్చాను.

ఒక యింటిగడపమీద కూర్చొని చెంగులో ముఖం దాచుకుని వెక్కివెక్కి ఏడుస్తోంది. నాకు కోపం జాలి రెండూ ఒక్కసారే కలిగాయి.

మరునాడు మా నాన్నతో కలిసి మదరాసు వెళ్ళాను. మదరాసులోని వింతలు విశేషాలు చూడటంతో ఇది మరిచి పోయాను. తిరిగి రాగానే మామూలుగానే కమలాక్షిని చూడటానికి వెళ్ళాను. ఆ ముఖంలోని చిరునవ్వు మరింత వెలుగుగా కనిపించింది. దుద్దుల్లోని రవ్వలు బుగ్గలమీద తళతళలాడాయి. నన్నుచూసి నవ్వి, ఒక కాగితంమీద ఏదో రాస్తున్నట్టుగా నటించి అందిందా అని సైగచేసింది. నాకు ఏదో అర్థంకాలేదు. పనిచేసే పిల్ల దాన్ని గురించి సైగచేసింది. నేను దీంట్లో ఏదో కుంభకోణం వుంది దీన్నిగురించి దర్యాప్తుచేయాలని నిశ్చయించుకుని యింటికి బయలుదేరాను. అదృష్టవశాత్తు పనిచేసేపిల్ల దోవలో కనబడ్డది. దాన్ని దగ్గరకి పిలచి, "మీ అమ్మాయిగారు ఏదైనా వుత్తరం వచ్చిందా? అని అడిగాను "వుత్తరమా? లేదే!" అంది.

"అబద్ధమాడేవంటే చంపేస్తాను. నా సంగతి తెలియదులాగుంది. నీకు యిచ్చానని మీ అమ్మాయిగారే చెప్పింది" అది కొంచెంసేపు తటపటాయిస్తు నుంచుంది చివరకి.

"మీకు కోపంరాదంటే చెబుతాను"

"కోపం రాదులే చెప్పు"

"ఆ రోజున మీకు వుత్తరం యిద్దామనే వచ్చాను కాని మీరు కోపగించుకుని వెళ్ళిపోయారు. ఇవ్వాళ సాయంకాలం రండి తెచ్చి పెడతాను."

"ఆ వేషాలు నాదగ్గరేం పనికిరావు యిప్పుడే పట్టుకురా" కసిరాను. అది బెదురుతూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

సుమారు పదినిముషాల తరువాత ఒక చిన్న కాగితం తీసుకువచ్చి యిచ్చింది. ఆ వుత్తరానికి ఆది అంతం లేదు- రెండుమూడు వాక్యాలున్నాయి.

"మీరెవరో నాకు తెలియదు. కాని మరేమిటో తెలుసు! మీరెవరో చెప్పరూ?"

ఈ వుత్తరం చదవగానే సమాధానం ఏం రాయాలో తెలియలేదు. పనిచేసే పిల్ల అక్కడే నుంచునివుంది. జేబులో చెయ్యిపెట్టి చూస్తే రెండు రూపాయిలున్నాయి. వాటిని ఆ పిల్లకి యివ్వబోయాను. "వద్దండి మీ దయవుంటే చాలు" అని అక్కడనుంచి వెళ్ళిపోయింది. ఇంటికి వెళ్ళేసరికి మానాన్న నాకోసం చూస్తున్నాడు. "ఒరేయి ప్యాసయ్యావురా" అని అన్నాడు. ఇటూ ఆటూ అల్లరి చిల్లరగా తిరిగినప్పటికీ పరీక్ష ప్యాసయినందుకు నాకు చాలా సంతోషం కలిగింది.

మరునాడు బయలుదేరి బొంబాయి వెళ్ళాము. యింటికి తిరిగివచ్చేసరికి కాలేజీలు తెరిచారు. వెళ్ళేలోపున ఒక్కసారి కమలాక్షిని కలుసుకుందామని అనుకున్నాను. చాలా ప్రయత్నంకూడా చేశాను. ఏదీ కొనసాగలేదు. నాకోరిక మనస్సులో దాచి కాలేజీకి వెళ్ళాను. క్రొత్త ప్రదేశం, కొత్తమనుష్యులూ, నాకు నా చదువే సహాయమయింది. ఎప్పుడు శెలవలు వస్తాయా ఎప్పుడు కమలని చూద్దామా అని యుగాలుగా నిరీక్షించగా దసరాశలవలు వచ్చాయి. అమితమైన ఆనందంతో యింటికి బయలుదేరి వచ్చాను. నాన్న మామూలు ధోరణిలో కాలేజీ ఎల్లావుంది? అని ప్రశ్నించాడు. అమ్మమాత్రం "ఇంత చిక్కిపోయావేరా?" అని అడిగింది. నా మనస్సు వాటి అన్నింటికి సమాధానంచెప్పే స్థితిలోలేదు. ఎల్లాగో అల్లా రెండు మెతుకులు నోటవేసుకుని కమల కోసం బయలుదేరాను.

ఆ యింటి పరిసరాలలో కొద్దిక్షణాలు ఆగి నిరీక్షించాను. కాని ఆ మనిషి వచ్చే సూచనలేం కనిపించలేదు. చివరకి ధైర్యంచేసి వాళ్లన్నయ్య పేరు పిలుస్తూ తలుపుకొట్టాను. "ఎవరదీ?" అంటూ వచ్చి తలుపుతీసి నన్ను చూసి రెండడుగులు వెనక్కి వేసి నుంచుంది. ఆ మనిషిని అంత దగ్గరగా చూడటము అదే మొదటిసారి. ఆపాదమస్తకం రెప్ప వాల్చకుండా ఒక్కసారి చూశాను. కాళ్ళకి మట్టెలు, పమిట చాటునుంచి కనిపిస్తున్న మంగళసూత్రం నన్ను ఒక్కసారి స్తబ్ధుణ్ణిచేశాయి. నేను ఏదో చెబుదామని అనుకుంటుండగానే ఎవరో వస్తున్న సవ్వడి విని, "మా అన్నయ్య యింట్లో లేడు" అని లోపలికి పారిపోయింది. పిచ్చివాడిగా యింటికి వచ్చాను. మనస్సు నిర్జీవం అయినట్టు కనిపించింది. అప్పుడే యింట్లో చెప్పి మా బంధువుల వూరు వెళ్ళాను. కాని రెండోరోజునే నే చేసిన పొరపాటుని గ్రహించాను. మాకు వాళ్ళకి సాపత్యం ఎక్కడ? వాళ్ళు కోటీశ్వరులు, అందులోను ఇంకో కులం. అటువంటి వాళ్ళపిల్లని పెళ్లాడ కోరడం ఎంత హాస్యాస్పద! ఏనాడో చేసుకున్న అదృష్టంకల్ల ఆ పిల్ల నన్ను ప్రేమిస్తోంది. అదే కోటివేలు... వివాహమైతేనేం నన్ను ప్రేమించటం మానలేదుగా!... ఈ ఆలోచన నామనసుకెంతో ఉల్లాసాన్ని కలిగించింది. తిరిగి మావూరు వచ్చేశాను. శెలవలు చివరిదాకా కమలను చూడటానికి వెళ్లేవాడిని... కాని మాట్లాడటానికి అవకాశం దొరకలేదు. శలవలు అయిపోయి మళ్ళీ కాలేజీలు తెరిచారు...

కాలేజీ అంటే మొదటిసారి వున్న వుత్సాహం యీసారి నశించింది. ఏదో మామూలుగా అలవాటు ప్రకారం వెళ్ళడంసహా దానియందు ఎటువంటి ప్రత్యేకమైన యిష్టం లేకపోయింది. రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు రాత్రి ఒక విచిత్రమైన కల వచ్చింది. కమలని బలవంతంగా ఒక పడవలో కూర్చోపెట్టి సముద్రంలోకి ఎవరో తోశేశారు. ఏంచెయ్యాలో తోచక ఏడుస్తోంది. నేను "కమలా!" అని పెద్ద కేకతో నీళ్ళల్లోకి దూకాను. నిద్దర మెలుకువ వచ్చింది. జరిగిందంతా ఒక కల అని తెలిసింది కాని నా మనసులోని ఆదుర్దామాత్రం అణగలేదు.

మరునాడు బయలుదేరి యింటికి వచ్చేశాను. కమల ఎక్కడా కనిపించలేదు పిచ్చివాడిలా ఆ యింటి చుట్టూ రెండు రోజులు తిరిగాను, మూడో రోజు వుదయం పనిచేసే పిల్ల కనిపిం

చింది. కమల ఏదని అడిగాను. జబ్బుగా వుంటే రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో పెట్టారని చెప్పింది. ఆసుపత్రికి పరుగెత్తాను. అక్కడంతా నన్ను ఎరుగున్నవాళ్ళే...అక్కడి హెడ్ నర్స్ మా అమ్మకి పురుడుపోసింది. నన్ను చూసి పలకరించింది. ఆవిడని ప్రశ్నించగా కమలకి న్యుమోనియా, స్పెషల్ వార్డు, నాలుగవ నెంబరు గదిలో వుంటూంది అని చెప్పింది. మెల్లిగా నాలుగో నెంబరు గదిదగ్గరకి వెళ్ళాను. గదిలో కమల పడుకునివుంది. చుట్టూవాళ్ళ బంధువులు కూర్చుని వున్నారు. నన్ను చూసి నిట్టూర్పువిడిచి ప్రక్కకి ఒత్తిగిలింది.

ఇంటికి వచ్చాను. అమ్మ ఏదో ప్రశ్నలడిగింది. కాని ఏం సమాధానం చెప్పానో నాకు తెలియదు. ఆ రోజు ఎలా గడిచిందో తెలియదు. సాయంకాలం చీకటి పడేసమయానికి గులాబీపువ్వొకటి పుచ్చుకుని ఆసుపత్రికి బయలుదేరాను. కమల ఒక్కర్తె పడుకునివుంది. మెల్లగా గదిలోకి వెళ్ళి "కమలా!" పిలిచాను. చాలా ప్రయత్నంమీద కళ్ళు తెరిచింది. చిరునవ్వు నవ్వటానికి ప్రయత్నం చేసిందికాని అది కూడా ఆమె శక్తికిమించిన పని అయింది. "ఎలా వుంది?" అడిగాను.

"చాలా బాధగా వుంది, బ్రతకనేమో!"

"ఛా! అవేం మాటలు...రెండు మూడు రోజులలో తగ్గిపోతుంది."

నా చేతిలోని గులాబీపువ్వుని ఆమె చేతిలో పెట్టాను. ఆ పువ్వు తలలో పెట్టుకోవటానికి ప్రయత్నం చేసింది. నేనే ఆ పువ్వుని తలలో అమర్చాను. గదిలోకి నర్సు వచ్చి నావంక ప్రశ్నార్థంగా చూసింది. నేను శాలువ కమల మీద జాగ్రత్తగా కప్పి "వెడుతున్నాను రేపు మళ్ళీ వస్తాను" అన్నాను. నావంక ఒక్క క్షణం చూసి కళ్లు మూసుకుంది. నర్సు నా వంక కోపంగా చూస్తోంది. బయలుదేరి ఇంటికి వచ్చేశాను.

ఆ రాత్రి అంతా జాగరణలోనే గడిచిపోయింది. ఉదయం పదకొండు గంటలదాకా వూరంతా తిరిగివచ్చి భోజనంచేసి కూర్చున్నాను మనస్సంతా గడియారంమీదనే వుంది. ఈ ఆలోచనలతో నన్ను నేను మరిచిపోతున్న సమయంలో ఎవరో నన్ను రెండుసార్లు పిలిచారు. తేరిపారి చూసేసరికి కమలా వాళ్ళ అన్నయ్య నా ఎదురుగుండా నుంచుని వున్నాడు. "మీ నాన్న వున్నారా?" అని అడిగాడు.

"నా నాన్న ఎందుకు?"

"టాక్సీ కావాలి?"

"మా నాన్న వూళ్ళోలేరు. అయినా టాక్సీ ఎందుకు?"

"మాచెల్లెలు యీ వుదయంపోయింది. శవాన్ని యింటికి తీసుకు వెళ్ళాలి..."

కమల పోయిందా ... ఇవ్వాళ ఉదయం పోయిందా...... అప్పటి నా బాధని ఎవరితో కూడా చెప్పలేదు. నేనేం మాట్లాడ గలను? కమలపోయింది ... నా ఆలోచనలని భంగం చేస్తూ "టాక్సీ పంపుతావా?" అని అతనడిగాడు "పద నేనే తీసుకువస్తా" మా స్వంత కారు తీసుకుని బయలుదేరాను.

ఆసుపత్రిదాకా కారు ఎలా నడిపానో నాకే తెలియదు. నిన్న నాతో మాట్లాడిన కమల యీనాడు మమ్మలందర్నీ వదలి ఎక్కడికో వెళ్ళిపోయింది. నేను వాళ్ళన్నయ్యతోడు పట్టి కమలని కారులో భద్రంగా పడుకోబెట్టాను. నేను యిచ్చిన పువ్వు యింకా తలలో వేవుంది. నా జీవితంతోబాటు ఆ పువ్వు కూడా వాడిపోయింది...కమల పోయింది.

కాని నాలోని అగ్నిమాత్రం చల్లారలేదు. ఈ మండే హృదయాన్ని తెచ్చిపెట్టుకున్న నవ్వులో లేనిపోని హాస్యంలోదాచి కాలంగడుపుతూవచ్చాను. కాని యీరోజున మీరిచ్చిన గులాబీపువ్వు నన్ను పిచ్చివాడిని చేసింది. యింకొకసిగరెట్టు యియ్యి...

---

ఎలా చదవాలో నీకు చాతనవాలిగాని, ప్రతిమానవుడి జీవితమూ ఒక మహాకావ్యం.